క్లుప్తంగా

ఓటు హక్కు నమోదు చేసుకోండి



పెనమలూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య అన్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాడిగడప పురపాలక సంఘంలో 124 పోలింగ్ కేంద్రాలు, పెనమలూరు మండలంలో 42 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పెనమలూరు గ్రామంలో పలు పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేశారు. ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎవోలు ఓటర్ల జాబితాలో అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేసుకునే వారు కూడా దరఖాస్తు చేయవచ్చన్నారు.

ఉంగుటూరు: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉండి ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు చేస్తారని డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లలో ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియను డెప్యూటీ తహసీల్దార్ శనివారం పరిశీలించారు.

ఓటర్ల ప్రత్యేక ప్రచార కార్యక్రమం ప్రారంభం...

గన్నవరం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న 306 పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు జరగనున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల్లో గత నెల 27న ప్రచురితమైన ముసాయిదా ఓటర్ల జాబితాను బూత్ స్థాయి అందుబాటులో ఉంచారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి బి. చంద్రలీల పరిశీలించారు. ప్రజల నుంచి సేకరిస్తున్న దరఖాస్తులను ఆమె పరిశీలించారు. మొత్తం 528 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో 368 ఫారం-6, 52 ఫారం-7, 108 ఫారం-8 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. తహసీల్దారు, సహాయ ఓటర్ల నమోదు అధికారి సీహెచ్ నరసింహారావు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దారు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

350 మందికి ఉచిత వైద్య సేవలు



పెనమలూరు: మండలంలోని పెదపులిపాక గ్రామంలో ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత గుంటూరు శ్రీనివాసచౌదరి శిబిరాన్ని ప్రారంభించారు. దాదాపు 350 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈవో పద్మావతిదేవి, ప్రొఫెసర్లు డాక్టర్ కె.విజయకుమారి, డాక్టర్ నిర్మలాజ్యోతి బాయ్, డాక్టర్ అక్కమ్మ, డాక్టర్ స్వర్ణమంజరి, డాక్టర్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

పీఎన్‌బీ ఆధ్వర్యంలో వాక్‌థాన్



పెనమలూరు: పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం కానూరు కామయ్యతోపులో వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా సర్కిల్‌హెడ్ డీజీఎం అభిజిత్‌సిన్హా జెండా ఊపి వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు నిర్వహించే సమయంలో ఉద్యోగులు చిత్తశుద్ధి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారదర్శకతతో పని చేయాలన్నారు. పోరంకి మండల పరిషత్ పాఠశాలకు ఫర్నిచర్, ఇబ్రహీంపట్నంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో క్విజ్ నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

ఉపాధి పనులు గుర్తింపు

ఉంగుటూరు: గ్రామీణులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనులు గుర్తిస్తున్నారని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండలంలో మధిరపాడు, బొకినాల, చికినాల, చాగంటిపాడు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళికల గ్రామ సభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తోడ్పడే విధంగా సుమారు రూ.50 లక్షలు విలువగల 203 పనులు గుర్తించారు. కార్యక్రమంలో మధిరపాడు, చాగంటిపాడు, బొకినాల గ్రామాల సర్పంచులు టి.రామారావు, ఎ.లక్ష్మిఅనూష, బి.పాపారావు పాలకవర్గ సభ్యులు, ఏపీవో టి.వెన్నెల, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో సంపూర్ణ వైద్య సేవలు



యనమలకుదురులో మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద సంపూర్ణ వైద్య సేవలు అందించారు. 19 వ వార్డు సచివాలయాల్లో 19 వైద్య శిబిరాలు విజయవంతంగా పూర్తి చేశారు. మొత్తం 16, 224 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. యనమలకుదురు 5వ సచివాలయంలో శనివారం చివరి వైద్య శిబిరం నిర్వహించి 833 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. కమిషనర్ ఎస్.ప్రకాశరావు వివరాలు తెలుపుతూ మున్సిపాలటీ పరిధిలో సెప్టెంబర్ 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించామని చెప్పారు. ప్రతి వార్డు సచివాలయంలో వైద్య సిబ్బంది ముందుగా ఇంటింటి సర్వే చేసి రోగులను గుర్తించి టోకెన్‌లు ఇచ్చారన్నారు. వ్యాధులతో బాధపడేవారికి వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారిని ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తామని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బంది, మున్సిపాలిటీ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు అభినందనలు తెలిపారు. యనమలకుదురు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వెలగపూడి వరప్రసాద్, నాగబాబు ,ఫజల్ హక్, రెడ్డి శ్రీనివాస్, మరీదు శ్రీనివాసరావు, ఈడే గోపాలకృష్ణ, శ్రీనివాసారెడ్డి, గుమ్మడి అన్వేష్ పలువురు పాల్గొన్నారు.

పేదలందరికీ నాణ్యమైన వైద్యసేవలు

రామవరప్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారని రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సచివాలయం-3 పరిధిలో శనివారం జెడ్పీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 600 మందికి సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులతో పాటు కంటి, దంత, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ సువర్ణరాజు మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామంలో ప్రతి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాల ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

అర్చకస్వామి ఫణికి పీహెచ్‌డీలో గోల్డ్‌మెడల్



ఫణికుమార్‌కు గోల్డ్‌మెడల్ బహూకరిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు మామిళ్ళపల్లి ఫణికుమార్‌కు జ్యోతిష్యం పీహెచ్‌డీలో గోల్డ్‌మెడల్ లభించింది. ఉదయ్‌పూర్ మహర్షి కాలేజ్ ఆఫ్ వేదిక్ ఆస్ట్రాలజీలో - ఏ స్టడీ ఆన్ వేదిక్ రెమిడియల్ మెజర్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు వేదిక్ ఆస్ట్రాలజీ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అవార్డ్ ప్రదానం చేశారు. మహర్షి కాలేజ్ ఆఫ్ వేదిక్ ఆస్ట్రాలజీ జారీ చేసిన ధ్రువపత్రాల్ని , గోల్డ్‌మెడల్‌ను దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శనివారం ఫణికుమార్‌కు బహూకరించారు. జోతిష్య విభాగంలో ఏ స్టడీ అన్ వేదిక్ రెమిడియల్ మెజర్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు వేదిక్ ఆస్ట్రాలజీ అనే అంశం పై నిర్వహించిన పరిశోధనకు ఎంసీవీఏ ప్రిన్సిపాల్, డైరెక్టర్ (ఆర్ అండ్ డీ) డాక్టర్. ఎం శాస్త్రి గైడ్‌గా వ్యవహరించారు. దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార దిశగా జోతిష్యాన్ని సద్వినియోగం చేసుకొనే విధానాల పై పరిశోధన సాగించినట్లు తెలిపారు. ఫణికుమార్‌ను దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మోహనరావు, భక్త బృందాలు, పలు రాజకీయ పార్టీల ప్రముఖులు అభినందించారు.

వైభవంగా లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ట

కంకిపాడు: పట్టణంలోని ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో శ్రీ లక్ష్మీగణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీగణపతి హోమం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆర్యవైశ్య ప్రార్థనా మందిరం కమిటీ పర్యవేక్షించింది.

ఆహార పొట్లాలు పంపిణీ

కంకిపాడు: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో పట్టణంలోని బచ్చుపేట ప్రాంతంలో 100 మంది పేదలకు దుస్తులు, ఆహార పొట్లాల పంపిణీ శనివారం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కెఎస్ మల్లేశ్వరరావు, ఎం.గోవిందరావు, పి.ఆంజనేయులు, పి.అంకారావు, కె.నాగరాజు పాల్గొన్నారు.

రోగులకు అన్ని రకాల వైద్య సేవలు



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణ్‌కుమార్

గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఓపీ రిజిస్ట్రేషన్లు, ఆస్పత్రి రికార్డులను, ఆరోగ్యశ్రీ సేవలను ఆయన పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడిన ఆయన వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో పరిశుభ్రతను పాటించడంతో పాటు రోగులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ...ఆస్పత్రిలో గైనిక్, అనస్థీషియా, జనరల్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు ఉన్నాయని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. రోగులకు సంతృప్తికర స్థాయిలో వైద్యం అందించాలని తెలిపారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై కళాజాత

గన్నవరం రూరల్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు కోరారు. మండలంలోని పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల్లో శనివారం కళాజాతా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు ఖాతా కలిగి ఉండాలని, దీంతో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, ఏటీఎం రూపే, డెబిట్ కార్డు వంటి ప్రయోజనాలు ప్రజలకు లభిస్తాయని చెప్పారు. కొండపావులూరు బ్రాంచ్ సీఈవో గిరి, రైతులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలో అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమీక్షిస్తామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాహిత్య, సాంస్కృతిక పోటీలు



పచ్చదనం-పరిశుభ్రతపై నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

గన్నవరం: స్థానిక వీఎస్. సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో జరుగుతున్న మౌంట్‌ఫోర్ట్ విద్యా సంస్థల అంతర్ రాష్ట్రాల సాహిత్య, సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం, సంగీతం, జానపద పాటల పోటీల్లో ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన 27 పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. శనివారం సాయంత్రం నిర్వహించిన గ్రూపు డాన్స్ పోటీలు ఆకట్టుకున్నాయి. రసవత్తరంగా జరిగిన ఈ పోటీలో 22 గ్రూపులు పాల్గొన్ని ప్రతిభను చాటారు. ముఖ్యంగా పచ్చదనం-పరిశుభ్రతపై విద్యార్థులు ప్రదర్శించిన సందేశాత్మక నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. మరో రెండు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు.

కంకిపాడు విద్యార్థుల ప్రతిభ



కంకిపాడు: జిల్లా స్థాయిలో దివ్యాంగులకు నిర్వహించిన క్రీడల్లో కంకిపాడు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఐఈఆర్‌పీ పీవీడీ నాగేశ్వరి, మోకా దీప్తి, నాగమణి విలేకరులకు శనివారం వివరాలను వెల్లడించారు. మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో పోటీలు నిర్వహించారన్నారు. కె.కొండలరావు పరుగు పందెంలో, బిఎం కార్తీక్ త్రోబాల్‌లో, ఈడే భానుతేజ పరుగుపందెంలో, సిహెచ్ జీవన్‌కుమార్ పరుగుపందెంలో విజేతలుగా నిలిచారన్నారు. విజేతలను డీఈఓ తాహెరా సుల్తానా, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి నాయక్, సమన్వయకర్త కె.ఏడుకొండలు ప్రత్యేకంగా అభినందించి, ట్రోఫీలు అందించారన్నారు.

విశ్వరూప సభకు తరలిరండి

పెనమలూరు: హైదరాబాద్‌లో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న మాదిగల విశ్వరూప సభకు తరలిరావాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) ఉమ్మడి కృష్ణా జిల్లా గౌరవ అధ్యక్షుడు కొమ్ము ప్రసాద్ అన్నారు. పెనమలూరు ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి కరపత్రాలను నేతలు కొమ్ము ప్రసాద్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు బొకినాలకృష్ణ విడుదల చేశారు. సభకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరవుతారని తెలిపారు. మాదిగలు వేలాదిగా తరలిరావాలని పిలుపు నిచ్చారు. మట్టాజాన్, శీలం నరేష్, సాతులూరి రాజశేఖర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉయ్యూరు:ఓటరు జాబితాలో చేర్పులు, మార్పు లకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. జెడ్పీ పాఠశాలలో పోలింగ్ కేంద్రంలో తనిఖీలు చేపట్టి, ఓటర్ల అర్జీలను పరిశీలించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజులు పాటు పోలింగ్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

గన్నవరం: ఈ నెల 15న విజయవాడలో సీపీఎం ఆధ్వర్యంలో జరగనున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ప్రజారక్షణ భేరి బహిరంగ సభ పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా నాయకులు కె. వెంకటేశ్వరరావు, లక్ష్మణస్వామి, అనుమోలు వెంకటేశ్వరరావు, పిల్లి మహేష్ పాల్గొన్నారు.

ఐఓటీ టెక్నాలజీపై అవగాహన

రామవరప్పాడు: సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి అందిపుచ్చుకోవాలని ఎస్సార్కే కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు అన్నారు. ఎనికేపాడులోని కళాశాలలో ఐఓటీ టెక్నాలజీపై జరుగుతున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన విద్యార్థుల కోసం ఎంఎన్‌సీ కంపెనీలు ఉన్నత ఉద్యోగాలిచ్చేందుకు అన్వేషిస్తున్నాయని చెప్పారు. సీనియర్ ఐఓటీ ఇంజినీర్ కె. సుధ, సీఎస్‌సీ విభాగాధిపతి ఆశాలత, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పావని, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనారోగ్య కారణంతో వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: అనారోగ్య కారణంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... కానూరు సనత్‌నగర్‌కు చెందిన ప్రభుకుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన ఈ నెల 1వ తేదీన కలుపు మందు తాగాడు. విషయం భార్యకు చెప్పటంతో ఆమె ఆయనను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించింది. అక్కడ చికిత్స పొందుతూ ప్రభుకుమార్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండల కేంద్రానికి చెందిన ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యం అవ్వటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. విద్యార్థిని (18) గంటూరు జిల్లా నీరుకొండలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం ఈసీఈ చదువుతుంది. తల్లి విద్యార్థిని పెనమలూరు సెంటర్‌లో శుక్రవారం కాలేజీ బస్సు ఎక్కించింది. అయితే విద్యార్థిని సాయంత్రం కాలేజీ బస్సులో ఇంటికి రాలేదు. తల్లి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు యువకులపై కేసు

పెనమలూరు: విద్యార్థిని వేధించిన ముగ్గురు యువకుల పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్‌కు చెందిన విద్యార్థిని గంగూరులో పాలిటెక్నిక్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. శుక్రవారం కాలేజీ ముగిసిన తరువాత ఇంటికి రావటానికి గంగూరులో ఆటో ఎక్కుతున్న సమయంలో కలపాల దావీదు, ఆరాధ్యుల రవి, సుధీర్ అనే యువకులు విద్యార్థిని చేయి పట్టుకుని లాగి తమ వాహనం ఎక్కాలని ఒత్తిడి చేశారు. ఆటోలో ఆమె ఇంటికి బయలుదేరగా యువకులు వెంటపడ్డారు. ఇంటి వద్దకు రాగా విద్యార్థిని తన తల్లి వీరలక్ష్మికి చెప్పింది. దీంతో తల్లి కేకలు వేయగా యువకులు పారిపోయారు. ఈ ఘటన పై ఫిర్యాదు చేయంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... పోరంకి రామాపురం కాలనీకి చెందిన అప్పికట్ల బిందు, బందరుకు చెందిన తేళ్ల వినోద్‌బాబు పరస్పరం ప్రేమించుకొని 2020లో వివాహం చేసుకున్నారు. వీరికి బాబు పుట్టాడు. అయితే భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను వరకట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. భర్తతో పాటు అత్త లిల్లిగ్రేస్, ఆడపడుచు విబిత కూడా వేధించటంతో పలు దఫాలుగా కట్నం సొమ్ము ఇచ్చారు. అయితే అత్తింటివారిలో మార్పు రాకుండా బిందును వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసును ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో అత్తింటివారి పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు



రామవరప్పాడులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న వీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సత్యవతి

రామవరప్పాడు: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ ప్రాజెక్ట్స్ సత్యవతి అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో శనివారం అధికారుల బృందంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. సత్యవతి మాట్లాడుతూ జాతీయరహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని సూచించారు. జాతీయరహదారిపై దుకాణదారులు, హోటల్స్, బడ్డీకొట్లు వారు చెత్తను పడేయకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కువగా చెత్తను పడేస్తున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలన్నారు. డ్రెయిన్లు, కాలువలు పారుదల అయ్యేవిధంగా పూడికతీత పనులు నిర్వహించాలన్నారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, ఈవోఆర్డీ శేషగిరిరావు, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు గొడవర్రు జెడ్పీ విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

కంకిపాడు: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో ఈ నెల 1న గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో గొడవర్రు జెడ్పీ పాఠశాల విద్యార్థులు రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం ప్రత్యేకంగా అభినందించారు. అండర్-17 బాలుర విభాగంలో బి.డేనియేలు డిస్కస్ త్రో మొదటి స్థానం, వి.కరుణసాయి 800 మీటర్ల పరుగులో రెండో స్థానంలో నిలిచారన్నారు. బాలికల విభాగంలో డి.శ్రీజ షాట్‌పుట్‌లో మొదటి స్థానం, డిస్కస్‌త్రోలో రెండో స్థానం, పీ.మేరీజ్యోత్స్న 800 మీటర్ల పరుగులో రెండో స్థానం, 3 వేల మీటర్ల పరుగులో రెండో స్థానం సాధించారన్నారు. పి.తేజ 1500 మీటర్ల పరుగులో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. అండర్-14 బాలుర విభాగంలో బి.అశ్విన్ షాట్‌పుట్ మొదటి స్థానం, డిస్కస్ త్రో మొదటి స్థానంలో నిలిచాడన్నారు. బాలికల విభాగంలో ఎం.ప్రవల్లిక డిస్కస్‌త్రో రెండో స్థానంలో, ఎం.రిషిత 600 మీటర్ల పరుగులో మూడో స్థానం, లాంగ్‌జంప్‌లో రెండో స్థానం సాధించారన్నారు. ఎస్.హర్షిత 400 మీటర్ల పరుగులో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయలు పి.గంగాభవాని, డి.లీలాకృష్ణలను ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్న హయాంలో మైనార్టీలకు మేలు



కానూరులో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్.గౌస్‌మొహిద్దిన్

పెనమలూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మైనార్టీలకు ఎంతో మేలు చేకూరిందని వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్.గౌస్‌మొహిద్దిన్ అన్నారు. కానూరు సనత్‌నగర్‌లోని సిద్దిక్‌నగర్‌లో మక్కా మసీదు సభ్యుల ఆహ్వానం మేరకు మసీదుకు వచ్చి శనివారం ఆయన ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనారిటీలకు సామాజిక న్యాయం జగనన్న ప్రభుత్వంలోనే అమలవుతుందని తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జగనన్న పాలనలో మొదటిసారిగా ముస్లింల మైనార్టీలకు ఆర్థికంగా, రాజకీయంగా పెద్ద పీట వేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మసీదు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎండి.మోయిన్, మసీదు అధ్యక్షుడు ఖాదర్, కార్యదర్శి షేక్.బాజీ, ఉపాధ్యక్షుడు షేక్.వాహెబ్, షేక్.బాజానీ, ట్రెజరర్ షేక్.ఆసీఫ్, సభ్యులు అబ్దుల్ హమీద్, షేక్.యూసూఫ్, షేక్.రియాజ్ పలువురు పాల్గొన్నారు.

రైతుపక్షపాతి సీఎం జగన్



సీడీసీ చైర్మన్ రామచంద్రరావును సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని, ప్రజాప్రతినిధులు

ఉయ్యూరు: రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. సీడీసీ చైర్మన్‌గా నియమితులైన ఏఎంసీ మాజీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావును మున్సిపల్ చైర్మన్ వల్లభనేనితో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు శనివారం కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ ప్రతిపక్షాలు రైతు సమస్యలపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సీఎం జగన్ పాలనలో రైతులు అంతా సంతోషంగా ఉన్నారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వంపై రాజకీయ దురుద్దేశంతోనే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీసీ నాయకుడు రామచంద్రరావు లాంటి వ్యక్తికి సీడీసీ చైర్మన్ కట్టబెట్టి సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అబుకలాం, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, రాజులపాటి చిన్ని, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్, నాయకులు జగరోతు నాగరాజు, జంపాన దీపు తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ హాస్పిటల్స్
మా వైద్య బృందంలో సభ్యులు అవుతున్న
డా॥ జాజాల పూర్ణచంద్ర రావు
సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్ గారికి
స్వాగతం పలుకుతుంది క్యాపిటల్ హాస్పిటల్స్
డా॥ జాజాల పూర్ణచంద్ర రావు
M.D(Gen Med), PGDID(Infectious Disease)
Senior Consultant Physician
అపాయింట్‌మెంట్ కొరకు: 8374443456
మచిలీపట్నం రోడ్, పోరంకి, విజయవాడ.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com